## ఉపాధ్యాయులు లేకుంటే సమాజం ఉండదు



వివరాలు 4లో


# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 02 మే, 2025 | పేజీలు : 08


## ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జిల్లాలోని చిల్పూర్ మండల పరిధిలో, రాజవరం గ్రామ పంచాయితీల్లో ఎంఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని, సంబంధిత కొనుగోళ్ల రిజిస్టర్లను తనిఖీచేసి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కేంద్రాలలో కల్పించిన మౌళిక సదుపాయాలపై ఆరా తీశారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల వద్దనే ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు.ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి మాదవిలత, తహశిల్దార్ సరస్వతి, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో మధుసూధన్, ఎంఏఓ నజీరుద్దీన్, ఏపీఎం రమేష్, వైద్యాధికారి కుషాలీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ఇళ్లకు సంబంధించిన పూర్తి నివేదికలు సిద్ధం చేసి తక్షణమే అందజేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అకాల వర్షాలు, దెబ్బతిన్న ఇండ్లు, పంటలు వాతావరణ శాఖ యాప్ ద్వారా రైతులకు తక్షణ సమాచారం అందచేయుట తదితర అంశాలపై రెవెన్యూ, డిఆర్డీఓ, పౌర సరఫరాలు, మార్కెటింగ్, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాల వల్ల ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు చేపట్టేందుకు అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్ఫాలిన్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. డిఆర్డీఏ, సహకార శాఖల అధికారులు కొనుగోలు కేంద్రాల్లో ప్యాడి క్లీనర్లు, మాయిచర్స్, టార్ఫాలిన్లు, గన్నీలు, వేయింగ్ యంత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు తక్షణ సహాయ సహకారాలు అవసరమని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ నుండి వచ్చే సూచనలు, సలహాలు యాప్ ద్వారా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేయాలని, తద్వారా రైతులు ముందస్తు చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పంటలు నష్టం వివరాలను వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, ఇండ్ల నష్టం అంచనాలను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం కొరకు సిఫారసు చేసేందుకు నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిఆర్డీఓ నరేష్, పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాధ్, డిఎం రాములు, మార్కెటింగ్ అధికారి కనక శేఖర్, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి వీరు నాయక్, ఆర్డిఓ రవి, అన్ని మండలాల తహసీల్దార్లు, పాక్స్ సీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## మల్లూర్ మండలంలో గాలివాన బీభత్సం



వందల ఎకరాల్లో నేలకొరిగిన వరి,
నెల రాలిన మామిడి

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఈదురు గాలులకు ఎగిరిపోయిన ఇళ్ల పై రేకులు

**ప్రజాపక్షం/మల్లూర్:** మండలంలో బుధవారం రాత్రి గాలి వాన భీభత్సం సృష్టించింది.ఒక్కసారిగా భారీ ఈదురు గాలులతో కురిసిన వర్షానికి వందల ఎకరాల్లో కోయడానికి సిద్ధంగా ఉన్న వరి నేలకొరిగింది. మండలంలోని పలు ఐకేపీ కేంద్రాల్లో ఆర బోసిన ధాన్యం తడిసిపోయింది. మండలంలోని ఐకేపీ కేంద్రాలు గత వారం ప్రారంభించినప్పటికి ఒక్క చోట కూడా ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు లేకపోవడంతో వరి ధాన్యం తడిసి పోయింది అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం తాడిచెర్ల లో గాలి వానకి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తాడిచెర్ల లోని ఇండియన్ గ్యాస్ కార్యాలయం తో సహా పలువురు ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. పదుల సంఖ్యలో చెట్లు నేలకొరుగగా, భారీ సంఖ్యలో మామిడి చెట్లు కాయలు రాలి పోయాయి.శ్రీ సాయి వాణి విద్యానికేతన్ పాఠశాల తరగతి గదుల రేకులు పూర్తి స్థాయిలో ధ్వంసం అయ్యాయి అని పాఠశాల కరస్పాండెంట్ సంపత్ రావు తెలిపారు. రానున్న రెండు మూడు రోజులు వర్ష సూచన ఉంది అని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకొని త్వరిత గతిన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ

**ప్రజాపక్షం/హనుమకొండ:** అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యం లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సదస్సు,కవిసమ్మేళనం బాలసముద్రం లోని సీపీఐ కార్యాలయంలో బూర భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ వలుపదాసు రమ ఎన్.ఐ.టి వరంగల్ మాట్లాడుతూ జేమ్స్ వాట్ కనుగొన్న ఆవిరి యంత్ర ఆవిష్కరణతో పారిశ్రామిక విప్లవం 1760 లో బ్రిటన్ లో ప్రారంభమై క్రమక్రమంగా ప్రపంచ మంతా వ్యాపించిందని, మానవ జాతి చరిత్రలో పారిశ్రామిక విప్లవం అతి ముఖ్యమైన సంఘటనని, అప్పుడే ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థకు పునాదులు పడ్డాయని, అప్పుడే సంఘటిత కార్మిక వర్గం పుట్టుకొచ్చిందని, ఎనిమిది గంటల పనిదినం కోసం 1886 మే 1 అమెరికాలోని చికాగోలో జరిగిన చారిత్రాత్మిక పోరాటం మరువరానిదని అన్నారు. అనేక దేశాల్లో జరిగిన పోరాటాల ఫలితంగానే అనేక హక్కులు కార్మికులు సాదించుకున్నారని ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిది మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న అనేక హక్కులు మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆవేదన చెందారు. విశిష్ట అతిథిగా హాజరైన అటవీ శాకాదికారి వరంగల్ పురుషోత్తం మాట్లాడుతూ భారత దేశంలో మొట్టమొదటిసారిగా 14 గంటల పనిదినాన్ని 8 గంటల పనిదినంగా తగ్గించిన మహనీయుడు డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. హనుమకొండ భారత్ బచావో ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. వెంగల్ రెడ్డి మాట్లాడుతూ వేతనాల చెల్లింపు చట్టం 1936లో కనీస వేతనాల చట్టం 1948లో సమాన పనికి సమాన వేతన చట్టం 1961లో, బోనస్ చెల్లింపు చట్టం 1968లో వచ్చాయని కానీ ఇవన్నీ మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020 తో రద్దవుతాయని అన్నారు.దినసరి వేతనం 736 రూపాయలు ఉంటే, మోడీ ప్రభుత్వం మారి దారుణంగా 178 రూపాయలుగా నిర్ణయించిందని లాభనష్టాలతో సంబంధం లేకుండా 8 శాతం నుండి 20 శాతం బోనస్ చెల్లింపును లేబర్ కోడ్ 2020 లో దీన్ని తొలిగించారని అన్నారు. ఈ సదస్సులో పాక వెంకటేశ్వర్లు, గుడికందుల ప్రకాశం, జ్యోతి, గజ్జెల స్వరూప, భిక్షపతి, ప్రవీణ్ కుమార్ తమ కవితలను చదివారు.



# ఘనంగా మేడే దినోత్సవ వేడుకలు

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/రేగొండ :**ఘనంగా 139వ మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా మేడే దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని మండల సిపిఐ కార్యదర్శి పెంట రవి, పైళ్ల శాంతి కుమార్ లు తెలిపారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో సిపిఐ మండల కార్యదర్శి పెంట రవి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా సమ్మిరెడ్డి హాజరై రేగొండ, రేపాక, రేపాకపల్లి, దమ్మన్నపేట చెన్నాపూర్, రూపి రెడ్డిపల్లి,కొత్తపల్లి తిరుమలగిరి, కోటంచ, కాకర్లపల్లి, కనపర్తి, గోరుకొత్తపల్లి మండలాలలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పైళ్ల శాంతి కుమార్ ఆధ్వర్యంలో చిన్న కొడపాక గ్రామంలో వీడే వేడుకల్లో భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం శాంతి మాట్లాడుతూ కార్మికులు చికాగో నగరంలో జరిగిన ఉద్యమంలో నుండి అమరవీరుల రక్తం నుంచి ఉద్భవించిన జెండా ఎర్ర జెండా అని తెలియజేయడం జరిగింది. మే డే దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రపంచవ్యాప్తంగా కార్మికులు జరుపుకునే దినోత్సవం మేడే కావున కార్మికులు కర్షకులు రైతులు రైతు కూలీలు యువత పెట్టుబడిదారీ వర్గానికి, కార్మిక వర్గానికి మధ్య జరిగే పోరాటంలో కార్మిక వర్గం వారి హక్కులను కాపాడుకోవాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులకు భంగం కలిగిస్తే ఉద్యమానికి ఉధృతం కావాలని పిలుపునిచ్చారు. ఒక మనిషిని మరో మనిషి దోపిడీకి గురికాకుండా సమ సమాజాన్ని నిర్మించుకోవాలని ఆ దోపిడీ లేని సమాజం కోసమే కమ్యూనిస్టులు అహర్నిశలు పోరాటాలు ఉద్యమాలు చేస్తున్నారని అలాంటి కమ్యూనిస్టుల కమ్యూనిస్టులు కలలుగన్న సమసమాజ నిర్మాణం జరగాలని దానిలో భారత దేశ పౌరులంతా కంకణ బద్ధులై ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు గుంటి చంద్రమౌళి, రేగొండ మండల కార్యదర్శి పెంట రవి, అన్నారం రాజేందర్, కుడారి భవాని, కూరాకుల లలిత, పంచాగిరి ప్రకాష్, చక్రపాగయ్య, మార్కరామయ్య, పప్పుల సారయ్య, బోట్ల చంద్రమౌళి, రాజమౌళి, రమేష్, రవీందర్, పబ్బరాజు, పసుల రాకేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## గణపురంలో గాలివాన బీభత్సం

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలో బుధవారం రాత్రి గాలివాన కి భారీ నష్టం వాటిల్లింది. గణపురం మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన రత్నం బాబుకు చెందిన 5 ఎకరాల మామిడి తోట కోత సమయానికి గాలివాన రావడంతో మామిడి కాయలు మొత్తం నేల రాలాయి. దీంతో సుమారు రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని రైతు బాబు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంటకు ప్రభుత్వం పంటను పరిశీలించి నష్ట పరిహారంఅందజేయాలని వేడుకుంటున్నారు.

## మేడే అంటేనే చెమట చుక్కల పండుగ



**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రపంచ వ్యాప్తంగా మే డే అంటేనే అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శ్రమజీవుల చెమట చుక్కల పండుగని హమాలి యూనియన్ సంఘం ప్రెసిడెంట్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. 139వ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా చిట్యాల మండలం గోపాలపురం గ్రామంలోనీ ముఖ్య కూడలిలో హమాలీ యూనియన్, సిపిఐ సీనియర్ నాయకుడు కోడూరు మల్లయ్య ఆధ్వర్యంలో హమాలి యూనియన్ కార్మికులతో కలిసి శ్రమజీవుల జెండా పండుగ ఆవిష్కరణకు ఏర్పాటు చేయగా హమాలి కార్మికుల యూనియన్ అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, సిపిఐ అనుబంధ ఏఐటీయూసీ జెండాను కళ్ళకు అద్దుకొని, ముద్దాడి మేడే వర్ధిల్లాలి, ప్రపంచ కార్మికుల ఐక్యత జిందాబాద్ అంటూ హమాలి సంఘం నాయకులు నినాదాలు చేసి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో హమాలి సీనియర్ నాయకులు మల్లయ్య, తౌటు సంజీవ్, కార్యదర్శి గూడెపు రాజు, స్వామి, రమేష్, రాజు, రవి, హమాలి యూనియన్ నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షల్లో శ్రీనేతాజీ విజయభేరి

**ప్రజాపక్షం/గణపురం:**గణపురం మండలంలోని బస్వరాజుపల్లి శ్రీ నేతాజీ ఉన్నత పాఠశాల 2024 25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశా తం ఫలితాలతో బూర రామ్ చరణ్ (567), కేసరి సహని (563), లుబ్న షరీఫ్ (557), మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలతో పాటు పది మంది విద్యార్థులకు పైగా 500 మార్కుల పైన కైవసం చేసుకుని విజయకేతనం ఎగురవేసింది. జిపిఏ లో నైనా మరియు మార్కులలో నైనా.. శ్రీ నేతాజీ ఉన్నత పాఠశాలకు సాటి మరొకరు లేరని మరో మారు నిరూపించారు. ఇంతటి అఖండ విజయానికి కారకులైన తల్లిదండ్రులకు, విద్యార్థులకు మరియు ఉపాధ్యాయ బృందానికి శ్రీ నేతాజీ పాఠశాల కరస్పాండెంట్ ఉడుత సాంబయ్య మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. మా విద్యార్థులు ముందు ముందు ఉన్నత విద్యలోనూ ప్రతిభను చూపాలని ఆశీస్తూ వారికి ప్రత్యేక శుభాభినందనలు తెలియజేశారు.

## పదో తరగతి ఫలితాలలో ఆర్బిట్ ప్రభంజనం

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామం పరిధి ఆర్బిట్ ఇటెక్నో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు బుధవారం వెలువడిన పదవతరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించారని ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్ రెడ్డి తెలిపారు. అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులలో ఎం. వినీల్ రెడ్డి581, టి. సంజనారెడ్డి580, ఏ. విశాల్ రెడ్డి 573 మార్కులు సాధించారని, అంతే కాకుండా 120 మంది విద్యార్థులలో 90 మార్కులకు పైగా సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

## మేడే స్ఫూర్తితో శ్రమదోపిడీపై ఉద్యమించాలి





**ప్రజాపక్షం/గణపురం:**గణపురం మండలం లోని చెల్పూర్ కేటిపిపి లో మే డే 139వ దినోత్సవం సందర్భంగా మేడే వేడుకలు ఏఐటియూసి అనుబంధ తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఆర్టిజన్ యూనియన్ (హెచ్64) రీజనల్ కమిటీ అధ్యక్షులు కోల శ్యామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదెలు హాజరై జెండా ఆవిష్కరణ చేయడం చేయడం జరిగింది. కార్పొరేట్ శక్తుల కోసం కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక లోకం పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసికేటీపీపి రీజనల్ కార్యదర్శి గోపిరెడ్డి కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిగినేని ధర్మారావు, మేకల రాజ్ కుమార్, బండారి నగేష్, పెరుక రాజేశ్వరరావు, ఎండి.సమీర్, సొల్లేటి సందీప్, చిట్ట పు అశోక్ రెడ్డి, ఓరుగంటి రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంట మహేందర్ రెడ్డి, బొమ్మ కంటి పవన్, పిప్పాల శ్రీ పాల్, ఒంటేరు చందర్ తదితరులు పాల్గొన్నారు.

**జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:**ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని భూపలపల్లి జిల్లా కేంద్రంలో 139 వ మేడే దినోత్సవాన్ని బిల్డింగ్ అండ్ కంస్ట్రక్షన్‌వర్కర్స్ యూనియన్ ఏఐటియూసీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ .జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ జెండా ఎగురవేసారు.ఈ కార్యక్రమంలో బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకటేష్,జిల్లా గౌరవ అధ్యక్షుడు చిలకాని రాజయ్య,వలి మహ్మద్, సిద్ధం రాజు,శ్రీవరాత్రి రమేష్,జెట్టి మోహన్, జిల్లెల సది,తదితరులు పాల్గొన్నారు.

**వాజేడు:**కనీస వేతనాలు అమలు చేయటంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు గురువారం అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు జేజ్జరి దామోదర్, బచ్చల కృష్ణబాబు, బచ్చల సోమ్య, శాంతకుమారి, ఆదినారాయణ, శాంత, ప్రవీణ, పెదం రమాదేవి పాల్గొన్నారు.

**కమలాపూర్:**139వ మేడే సందర్భంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో కమలాపూర్ మండల కేంద్రంతో పాటు శనిగరం, గూడూరు, కన్నూరు, గుండేడు, ఉప్పల్, శ్రీరాములపల్లి, వంగపల్లి, గూనిపర్తి, మాదన్నపేటతో పాటు పలు గ్రామాలలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే జెండాను ఆవిష్కరించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటియూసి హన్మకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్ముల రామ్మూర్తి మాట్లాడుతూ.... 8 గంటల పని దినం, దానితో పాటు బోనస్, నష్టపరిహారం, కనీస వేతనాల చట్టం, ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం, పిఎఫ్ సౌకర్యం ఇట్లా ఎన్నో హక్కులను సాధించుకోవడం జరిగిందని అన్నారు. ఆయా గ్రామాల కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

**గణపురం:**గణపురం మండలంలోని సింగరేణి ఓసీ త్రి ఏర్పడి ఐదు సంవత్సరాలు అవుతుంది. ఓసీ లో పనిచేసే ప్రైవేట్ కార్మికులు నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ అధ్యక్షులు మాచర్ల కనకయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు దిడ్డి బాలకృష్ణ పటేల్, బుర్ర శంకర్ గౌడ్, మొదటి సారి మే డే పురస్కరించుకొని కార్మికులు ఉత్సాహంగా జెండా ఎగరవేశారు.

## పాఠశాల టాపర్లకు సన్మానం



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తమ్మడపల్లి జి ఉన్నత పాఠశాల విద్యార్థినులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుమన్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. గురువారం తమ్మడపల్లి జి ఉన్నత పాఠశాలలో వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. హెచ్ఎం సీతారామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాఠశాలకు చెందిన చిలువేరు మౌనశీల 567 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానం సాధించగా, సముద్రాల తేజస్విని 559 మార్కులను సాధించగా వీరిని ఎంపీడీవో శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, గ్రామ పంచాయితి కార్యదర్శి హరీష్, ఉపాధ్యాయుడు సురేష్, కోచ్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ జాతీయ స్థాయి పోటీలకు చరిష్మ ఎంపిక

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) బాక్సింగ్ జాతీయ స్థాయి పోటీలకు మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన తాటికాయల చరిష్మ ఎంపికయ్యారని తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ ఆర్గనైజర్ సెక్రటరీ శీలం పార్థసారథి తెలిపారు. ఎంపికైన విద్యార్థిని చదువుతున్న పాఠశాల మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డి ఉమా మహేశ్వరి, ఫిజికల్ డైరక్టర పద్మ, పీఈటీ సరిత, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల పీఈటీలు, కోచ్‌లు రమేష్, శాంసన్, తదితరులు అభినందనలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/ తొర్రూరు :** మండలంలోని గోపాలగిరి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు యనమల సారయ్య ఇటీవల వడదెబ్బతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, తొర్రూరు పట్టణ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ధర్మారపు కిరణ్, గోపాలగిరి గ్రామ ఇన్‌చార్జ్ రాయిశెట్టి వెంకన్న, ధర్మారపు యాకూబ్, పెరటి మురళి కృష్ణారెడ్డి, జినుగ అనంతరెడ్డిలు గోపాలగిరి గ్రామానికి వెళ్లి వడదెబ్బతో మృతి చెందిన సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్‌గౌడ్, మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, పరుపాటి రవీందర్‌రెడ్డి, గజావెల్లి ప్రసాద్, మండల పార్టీ యూత్ నాయకులు ఎల్లస్వామి, జాటోతు అనిల్, చందు, లక్ష్మణ్, రాజేశ్, నేతావత్ శ్రీధర్, స్థానిక నాయకులుపాల్గొన్నారు.

## పది ఫలితాల్లో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ

**ప్రజాపక్షం/ తొర్రూరు :** పదవ తరగతి ఫలితాల్లో పట్టణ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాల విద్యార్థిని మహంకాళి నవ తేజస్విని 588 మార్కులు సాధించి మహబూబాబాద్ జిల్లా టాపర్‌గా నిలిచింది. ఎండి.షాహీన్ 576, ఎల్.రేవంత్ 575, బి.మమత 575, ఎస్.కార్తిక్ 570 మార్కులు సాధించి సత్తా చాటారు. వంద శాతం ఫలితాలతో తిరుగులేని పాఠశాలగా లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ రికార్డు సృష్టించింది. మొత్తం 96మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 10మంది విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించగా, 58మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. 588 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన నవ తేజస్వినిని పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, డైరెక్టర్లు ఎర్ర సంపత్, నాగిరెడ్డి, సునీత, ఉపాధ్యాయులు ఓం ప్రకాశ్, మురళికృష్ణ, యాకూబ్, సైదులు, భాస్కర్, రమేశ్, మధు, రాంమూర్తి,గపాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ కోసం హనుమకొండ జిల్లా పరిధిలోని వేలేరు, భీమదేవరపల్లి మండలాల్లో భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ కోసం చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియ, పరకాల నియోజకవర్గం లోని గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపు, జాతీయ రహదారుల నిర్మాణ పనులలో పూర్తి చేయాల్సిన వాటిపై హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్, మేనేజర్ సంపత్ రావు, ఇతర అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఆయా పనులకు సంబంధించిన పురోగతిని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భీమదేవరపల్లి, వేలేరు మండలాల పరిధిలో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియను మే చివరి నాటికల్లా ప్రాథమిక డిక్లరేషన్ పూర్తి చేయాలని ఆర్డీవో రాథోడ్ రమేష్ ను ఆదేశించారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే లో భాగంగా భూములు కోల్పోతున్న పరకాల దామెర శాయంపేట ఆత్మకూర్ మండలాల పరిధిలోని గ్రామాల నిర్వాసితులకు వెం టనే పరిహారం చెల్లించాలని ఆర్డీవో నారాయణ ను కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారి నిర్మాణ పనులలో భాగంగా ఫీల్డ్ పనులను త్వరగా పూర్తిచేయాలని జాతీయ రహదారుల శాఖ అధికారులకు తెలియజేశా రు. తహసీల్దార్లు విజయలక్ష్మి, జ్యోతి వరలక్ష్మి దేవి, జగన్మోహన్ రెడ్డి, సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల ఆరోపణలు సిగ్గుచేటు

**ప్రజాపక్షం/నెక్కొండ:** కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులపై కుట్రపూరితంగా అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించడం పూర్తి అవాస్తవమని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు భక్కి నరేష్ అన్నారు. నెక్కొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సంఘని సూరయ్యపై పోలీసులు రౌడీషీటర్ ఓపెన్ చేశారని అందుకు కారణం కాంగ్రెస్ నాయకులని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. నేరచరిత్ర కలిగి కేసులు ఉన్న వారి పైన పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారని అందులో కాంగ్రెస్ పార్టీ ప్రమేయం ఏముందని ప్ర శ్నించారు. సంగని సూరయ్యపై పలు రకాల కేసులు ఉన్నాయని అతను గ్రామాల్లో కార్యకర్తలను రెచ్చగొట్టి కేసులు పెట్టించడం సరికాదన్నారు. మండలంలో అక్రమ కేసులు పెట్టడానికి గతంలో బిఆర్ఎస్ నాయకులు పోలీసులను వారి ప్రభుత్వంలో ఇబ్బందులకు గురిచేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నెక్కొండ ఎస్సైపై ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు. మేము మా ప్రభుత్వం చట్టపరిధికి లోపలి పని చేస్తామని అధికారులను ఎలాంటి వత్తులు మీలా చేయమని ఆయన అన్నారు. అసలు రౌడీషీట్ అనేది ఎస్సై గారు చేస్తారా లేదా ఏసీపీ చేస్తారా అది కూడా తెలియకుండా ఎస్సైపై ఆరోపణలు చేయడం దివాలాకొరుతనానికి నిదర్శనం అన్నారు. చంద్రుగొండ గ్రామంలో గతంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షునిపై కుట్రపూరితంగా అట్రాసిటీ కేసు పెట్టించారని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు చంద్రుగొండ గ్రామంలో పోకల లక్ష్మి బీసీ మహిళపై దాడి చేస్తే ఆ మహిళ తిరిగి చెప్పుతో కొట్టింది అయినా సిగ్గు లేకుండా అప్పుడున్న పోలీసులను అడ్డం పెట్టుకొని ఆ మహిళపైనే సంబంధం లేని దళిత మాజీ వార్డ్ మెంబర్ తో అట్రాసిటీ కేసు పెట్టించింది నిజం కాదు అన్నారు. అక్రమ కేసులు పెట్టి అరాచకాలు సృష్టించింది నువ్వు కాదా అన్నారు అధికారాన్ని అడ్డం పెట్టుకొని కుళ్ళు రాజకీయాలతో కుట్రలు పన్ని కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టించింది నువ్వేనన్నారు. గ్రామంలో స్మశాన వాటిక భూమిని కూడా వదలకుండా కబ్జా చేసి నీతులు మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగం ప్రశాంత్, గుండ్రపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్ల శివకుమార్, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోడ ప్రవీణ్, నెక్కొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్రబోయిన శ్రీకాంత్ ,నాయకులు రామారావు రాము, ఎండి అఫ్జల్, భూక్య మిట్టు నాయక్, ఇటికాల భార్గవ్, దినేష్, సాంబరాజు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాడుతా

### మాజీ చీఫ్ విప్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్

**ప్రజాపక్షం/ హనుమకొండ :** కార్మికుల హక్కుల కోసం పోరాడుతానని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మేడే సందర్భంగా హనుమకొండ లష్కర్ బజార్ వద్ద హమాలీలు, ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని జెండా ఎగరవేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మిక శాఖ పరిధిలో 4 వేల ఇన్సూరెన్స్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులు వెంటనే స్పందించాలన్నారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కావాల్సిన వసతులను యాజమాన్యాలు కల్పించాలన్నారు. వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.ఈ మే నెల మొత్తం కార్మికుల కోసం కార్మిక మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చెన్నం మధు, నాయకులు గొర్రె విజయ్ కుమార్, నన్నెబోయిన రవి, మ్యాదరబోయిన రమేష్, రవి, కృష్ణయ్య, నయిమొద్దీన్, ఎన్ఐటీ హరి, చాగంటి రమేష్, ఎంజాల మల్లేశం, నాయిని రవి, కొలిపాక లింగయ్య, గంద్రతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక పోరాట స్ఫూర్తి చిహ్నామే మేడే

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాస్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** శ్రమ దోపిడికి వ్యతిరేకంగా శ్రమ గౌరవం కోసం కార్మిక పోరాట స్ఫూర్తి చిహ్నం, కార్మికుల రక్తంతో రాసిన చరిత్ర మేడే అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపెల్లి, ముల్కనూర్ గ్రామాల్లో నిర్వహించిన 139వ మేడే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. శ్రమదోపిడికి వ్యతిరేకంగా 1886లో చికాగోలో కార్మికులు సాగించిన పోరాటంలో పోలీస్ కాల్పుల్లో అనేక మంది చనిపోయారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొంగల రాంచంద్రారెడ్డి, నాయకులు ఆదరి రమేష్, మార్పు కృష్ణారెడ్డి, సుంచు కుమారస్వామి, సంజీవరెడ్డి, బోడ బాలరాజు, కిషోర్, గౌడ తిరుపతి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిఏ నిబంధనలు పాటించాలి

**ప్రజాపక్షం/ఏటూరునాగారం:** ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద గురువారం ఎస్ఐ తాజుద్దీన్ తమ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టి బస్టాండ్‌లోని ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటో, మ్యాజిక్ డ్రైవర్లు ట్రాఫిక్(ఆర్‌టిఏ) నిబంధనలు పాటించాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పకుండా కాకి చొక్కా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయకూడదని, ప్రతి రోజు నిత్యం డ్రంగ్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకొని వాహనాలు సీజ్ చేస్తామని ఎస్ఐ తాజుద్దీన్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు పోలీస్, సిఆర్‌పిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పూసల సంఘం మండల కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల పూసల సంఘం నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గురువారం మండలంలోని ముల్కనూర్‌లో సంఘం సభ్యులతో సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి సంపత్, ప్రధాన కార్యదర్శి పన్నీరు రాజశేఖర్ ఆధ్వర్యంలో పూసల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులు కోల వెంకటాద్రి, అధ్యక్షులు కోల రమేష్, ప్రధాన కార్యదర్శి ముదరకోల ఐలయ్య, ఉపాధ్యక్షులు ముదరకోల సురేందర్, సంయుక్త కార్యదర్శులు కోల సదానందం, రమేష్, శ్రీనివాస్, ఆర్గనైజ్ సెక్రటరీ కోల చందు, కోశాధికారి రాము ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఎన్నికైన కమిటీ బాధ్యులు మాట్లాడుతూ సంఘం, సభ్యుల అభ్యున్నతికి తమవంతు కృషిచేస్తామన్నారు.

## దళారుల నమ్మి మోసపోవద్దు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకునే సమయంలో దళారుల చేతుల్లో రైతులు మోసపోకూడదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని వేశాలపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రైతులు పంటలను అమ్ముకునే సమయంలో దళారుల చేతుల్లో మోసపోకూడదని, రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల మహేందర్, స్థానిక నాయకులు రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన రావుల

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని నాగారంలో మహిళా సంఘాల చే ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధ్య దళారులను రైతులు నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు కష్టించి పండించిన పంటను అమ్ముకోవాలని అన్నారు. కార్యక్రమంలో నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పోలిశెట్టి భాను ప్రకాష్, నెక్కొండ మార్కెట్ డైరెక్టర్ బొమ్మరబోయిన రమేష్ యాదవ్ ,జమ్ముల సోమయ్య, నాగారం గ్రామ కాంగ్రెస్ నేతలు ఉప్పుల లక్ష్మణ్, నాంపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి సాంబయ్య, బుర్ర నరసింహారెడ్డి, సింగం శ్రీనివాస్, కేతిరెడ్డి సంపత్ రెడ్డి, సిఏ సమ్మెట శ్రీనివాస్, అనిత ,పిట్టల తిరుమల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డిపిఓగా పదవి బాధ్యతలు స్వీకరించిన వీరభద్రయ్య

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న నారాయణ రావు ఏప్రిల్ 30న పదవి విరమణ చేయగా, ఆయన స్థానంలో డివిజనల్ పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న వీరభద్రయ్య పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. నూతన జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వీరభద్రయ్య గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధిలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి పంచాయతీలో శుభ్రత కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలవ్వాలని సూచించారు.

## శ్రీధర్ బాబు కృషి ఫలితమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### పిఏసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** శ్రీధర్ బాబు కృషి ఫలితమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు అని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ చల్ల తిరుపతి రెడ్డి అన్నారు.గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిచారు.ఈ సందర్భంగా మండలంలోని బెగ్లూర్,సూరారం;అంబట్ పల్లి,కాళేశ్వరం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి పలు సూచనలుచేసారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖా మంత్రిగా శ్రీధర్ బాబు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రాంభోత్సవానికి శ్రీకారం చుట్టారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ నాడు,నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించి ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను అన్ని విధాల ఆదుకుంటుందని అన్నారు.మంథని నియోజక వర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందే విధంగా మంత్రి శ్రీధర్ బాబు కృషి చేస్తున్నారని అన్నారు.

# ఉపాధ్యాయులు లేకుంటే సమాజం ఉండదు

## మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలు ఎదిగిన ప్రతి ఒక్కరు తాము పుట్టిన జన్మభూమికి సేవలు చేయాలని, ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రజా ప్రభుత్వం ఉన్నత విద్యను అందించడానికి చర్యలు తీసుకున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. విద్యను బోధన చేసే ఉపాధ్యాయులు లేకుంటే సమాజం ఉండదని, జీవితంలో జ్ఞానానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేయడంతో రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచిన ములుగు జిల్లా విద్యార్థిని, విద్యార్థులకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 97.63 శాతం విద్యార్థిని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి రాష్ట్రంలో 8వ స్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయమని, రానున్న విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. చిన్నతనం నుండే ఉత్తమ విద్యను అభ్యసించి అనుకున్న స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొందినప్పుడే కుటుంబాలను పోషించుకుంటారని, ఆస్తి ఉంటే గుంజుకునే అవకాశం ఉంటుందని విద్యను ఎవరు గుంజుకునే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో నూతన పరిజ్ఞానంతో విద్యను బోధించడానికి ఇప్పటికే జిల్లాలోని 10 పాఠశాలలోకు 100 కంప్యూటర్లను అందజేయడం జరిగిందని, ఏఐ పరిజ్ఞానంతో విద్యాబోధన జరుగుతున్నదని, రానున్న రోజులలో జిల్లాలోని మరి కొన్ని పాఠశాలలకు 150 కంప్యూటర్లను అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థిని, విద్యార్థులలో ప్రతిభను పెంపొందించడానికి చర్యలు తీసుకున్నామని దీనిలో భాగంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దత్తత తీసుకున్న తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడడం తనను ఎంతగానో ఆకట్టుకున్నదని అన్నారు. భవిష్యత్తులో జీవనోపాధి కోసం ఉపయోగపడే కోర్సులను విద్యార్థులు ఎంచుకోవాలని, ప్రతి ఒక్కరికి ఆత్మ విశ్వాసం అవసరంతో పాటు, పెద్దలను గౌరవించే సంస్కారం అలవరచుకోవాలని సూచించారు. ప్రయివేట్ పాఠశాలలు కళాశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పాఠశాలలకు ఫీజులు చెల్లించడంలో ఇబ్బందులకు గురవుతున్నారని, పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో తమ పిల్లలను పంపించాలని అన్నారు. ఎంత చదివినా విద్యకు ముగింపు లేదని తాను సైతం ఇప్పటికి మంత్రి హోదాలో ఉన్నప్పటికి విద్యను అభ్యసిస్తున్నానని అన్నారు. మంచి జ్ఞానం పొందిన విద్యార్థులు పది మందికి తమరి జ్ఞానాన్ని పంచాలని, ఏజెన్సీ జిల్లాగా పేరు పొందిన ములుగు జిల్లాలో ఉన్నత స్థానాలు ఎదిగిన వారు తమ సేవలను కొనసాగించాలని కోరారు. అనంతరం మంత్రి సీతక్క ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థిని, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి అభినందించి శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా విద్యాశాఖ అధికారి డి పాణిని, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కులగణన చేస్తామన్న కేంద్ర నిర్ణయం స్వాగతిస్తున్నాం

### తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ

ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : కులగలను చేస్తామని కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ స్వాగతిస్తూ నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం కాకతీయ విశ్వవిద్యాలయం ఎస్డిఎల్సి, పూలే ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 95 సంవత్సరాల క్రితం బ్రిటిష్ ప్రభుత్వం కులగలను జనాభా లెక్కలు చేసిందన్నారు. ఆ తర్వాత ప్రతిపక్షాల డిమాండ్ ప్రజల ఆకాంక్ష అర్థం చేసుకున్న కేంద్ర ప్రభుత్వం కుల గణనతోపాటు జనాభా లెక్కలు చేస్తామని కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. కులగణనను అంగీకరిచ్చినందుకు ప్రధాన మంత్రి మోడీతో పాటు ఈ అంశాన్ని గత నాలుగు సంవత్సరాల నుండి ఒక ప్రధాన అంశంగా, నినాదంగా తీసుకొని దేశమంతా తిరిగి ప్రజల డిమాండ్ గా ప్రస్తావించి ప్రభుత్వం మీద తీవ్ర ఒత్తిడి చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. కానీ ఇల్లు అలకగానే పండుగ అయినట్టు కాదని కేవలం కుల గణన చేస్తామని నామమాత్రంగా చేసి చేతులు దులుపుకోవడం ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయం జరగదని అది ఆచరణాత్మకంగా అన్ని రంగాల్లో ఇంతకాలం తీవ్ర వివక్షతకు గురి అయిన బీసీ ప్రజలకు సమన్యాయం జరిగినప్పుడే ప్రజల అందరి అభివృద్ధి జరుగుతుందని రాహుల్ గాంధీ కోరిన సమ న్యాయం జరుగుతుందని భావించాలి. చట్టసభలతో పాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో 76 సంవత్స రా ల నుండి నిర్లక్ష్యానికి గురి కాబడిన ప్రజలకు న్యా యం చేయవలసిన అవసరాన్ని ఇప్పటికైనా గుర్తించినందుకు ఈ సామాజిక వర్గాలు సంతోషిస్తున్నా రు. ఇక కేవలం ప్రకటనలతో కాలయాపన చేయకుండా నియమిత కాలములో కుల గణన, చట్ట సవరణ చేయవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణతో పాటు సంఘాన్ని సంగాని మల్లేశ్వర్, నల్లని శ్రీనివాసు, కొట్టే భాస్కర్, డాక్టర్ మంద వీరస్వామి పాల్గొన్నారు.

## ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణ




ప్రజాపక్షం/ఖిలా వరంగల్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసేందుకు 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని వాటి రద్దుకు కార్మిక వర్గం పోరాడాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ పడమర కోట సెంటర్‌లో 139వ మేడే ఉత్సవాలను ఘనంగా జరిపారు. ముందుగా కార్మికుడైన ఎండి అక్బర్ జెండా ఆవిష్కరించగా అనంతరం జరిగిన కార్యక్రమానికి మైదం సంజీవ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు బండి కోటేశ్వరరావు, టిపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, జిల్లా అధ్యక్షులు అశోక్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్, నలిగంటి పాల్, కార్మికులు, ఇతర సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఐఎఫ్‌టియూ ఆధ్వర్యంలో అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో మే డే:**భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టియూ) ఆధ్వర్యంలో అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో నక్కలపల్లి, నల్లగుంట, శంభునిపేట, ఖిలా వరంగల్, మధ్యకోట, ఏకశిలా పార్క్ , ఇసుక అడ్డ, పడమరకోట సెంటర్, వరంగల్ పెట్రోల్ పంప్ సెంటర్‌లలో మేడే జెండాలు ఎగురవేశారు.

## ఫైనాన్సర్ల వేధింపులపై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు

### మూడు ఫైనాన్సు కంపెనీలకు నోటీసులు జారీ

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : అప్పు తీసుకున్నందుకు ఫైనాన్స్ కంపెనీలు దుర్భాషలాడుతూ, వేధింపులకు పాల్పడుతున్న మూడు కంపెనీలపై హన్మకొండ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే హన్మకొండ జిల్లా, ధర్మసాగర్ మండలం, కరుణాపురం గ్రామానికి చెందిన బచ్చలకూరి సురేష్ హన్మకొండ జెఎం ఫైనాన్స్ కంపెనీలో రూ.21 లక్షలు హోమ్ లోన్ తీసుకున్నాడు. అదేవిధంగా హన్మకొండ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో యాప్ ద్వారా రూ.4 లక్షలు పర్సనల్ లోన్, వరంగల్ కొటక్ మహీంద్రా బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.3 లక్షల అప్పు తీసుకున్నాడు. తీసుకున్న రుణాలకు అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా, మిగతా బకాయిలు వసూలు చేసే నెపంతో ఆయా కంపెనీల రికవరీ ఏజెంట్లు ఇంట్లోని మహిళలు, చిన్నపిల్లల ముందు దుర్భాషలాడుతూ వేధింపులకు పాల్పడుతున్నారని, తనను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న పై కంపెనీల వేధింపుల నుంచి తమకు విముక్తి కల్పించాలని బచ్చలకూరి సురేష్ న్యాయం కోసం కోర్టును ఆశ్రయించాడు. ఫైనాన్స్ కంపెనీలు ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా రికవరీ ఏజెంట్లతో బాధితులపై చేస్తున్న ఆగడాలను, తీవ్రమైన ఒత్తిడిని నుంచి ఉపశమనం కల్పించాలని, బాధితుడు సురేషను ఫైనాన్స్ కంపెనీలు శారీరక మానసిక హింసకు గురి చేస్తున్నాయని, బాధితుని తరపున న్యాయవాది ఉప్పరి శంకర్ బాధితుడికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఇట్టి వాదనలు విన్న న్యాయమూర్తి ప్రియాంక సిరిసిల్ల బాధితుడిపై ఎలాంటి బెదిరింపులకు, వేధింపు చర్యలకు పాల్పడ వద్దని, మూడు ఫైనాన్స్ కంపెనీలకు బుధవారం తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ

ప్రజాపక్షం/హనుమకొండ : అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యం లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సదస్సు,కవిసమ్మేళనం బాలసముద్రం లోని సీపీఐ కార్యాలయంలో బూర భిక్ష పతి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ వలుపదాసు రమ ఎన్.ఐ.టి వరంగల్ మాట్లాడుతూ జేమ్స్ వాట్ కనుగొన్న ఆవిరి యంత్ర ఆవిష్కరణతో పారిశ్రామిక విప్లవం 1760లో బ్రిటన్ లో ప్రారంభమై క్రమక్రమంగా ప్రపంచ మంతా వ్యాపించిందని, మానవ జాతి చరిత్రలో పారిశ్రామిక విప్లవం అతి ముఖ్యమైన సంఘటనని, అప్పుడే ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థకు పునాదులు పడ్డాయని, అప్పుడే సంఘటిత కార్మిక వర్గం పుట్టుకొచ్చిందని, ఎనిమిది గంటల పనిదినం కోసం 1886 మే 1అమెరికాలోని చికాగోలో జరిగిన చారిత్రాత్మిక పోరాటం మరువరానిదని అన్నారు. అనేక దేశాల్లో జరిగిన పోరాటాల ఫలితంగానే అనేక హక్కులు కార్మికులు సాధించుకున్నారని ఈ సందర్భంగా అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన అటవీ శాకాదికారి వరంగల్ పురుషోత్తం మాట్లాడుతూ భారత దేశంలో మొట్ట మొదటి సారిగా 14 గం పనిదినాన్ని 8 గం పనిదినంగా తగ్గించిన మహనీయుడు డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. హనుమకొండ భారత్ బచావో ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. వెంగల్ రెడ్డి మాట్లాడుతూ వేతనాల చెల్లింపు చట్టం 1936లో కనీస వేతనాల చట్టం 1948లో సమాన పనికి సమాన వేతన చట్టం 1961లో, బోనస్ చెల్లింపు చట్టం 1968లో వచ్చాయని ఇవన్నీ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020తోరద్దవుతాయని అన్నారు

## కులగణనలో తెలంగాణ దేశానికి ఆదర్శనీయం



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: కులగణనలో తెలంగాణ దేశానికి ఆదర్శనీయమని పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, బచ్చన్నపేట మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలంటూ రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలు చాలాకాలంగా డిమాండ్ చేయడం జరిగిందని, నేడు జరిగిన క్యాబినెట్ బేటీలో కాంగ్రెస్ డిమాండ్‌కు మోదీ సర్కార్ ఓకే చెప్పిందన్నారు. రాష్ట్ర కులగణన దేశానికి ఆదర్శనీయంగా నిలిచిందన్నారు.దేశవ్యాప్తంగా బీసీ కుల గణన పట్ల రాహుల్‌గాంధీ,సోనియాగాంధీకి, రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి, సందీప్, రమేష్, హరికృష్ణ, రమేష్, అఖిల్, ప్రవర్ధన్, రాములు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## 100శాతం ఫలితాలు సాధించిన ఎంజెపి తిమ్మాపూర్ విద్యార్థులు

ప్రజాపక్షం/హసన్ పర్తి : బుధవారం రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన పదవ తరగతి ఫలితాల్లో హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎంజెపి తిమ్మాపూర్ బాలికల పాఠశాలలో 100కు 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ ఎ.శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజెపి తిమ్మాపూర్ పాఠశాలలో ఎం. నాగశ్రీ 600కు గాను 574 మార్కులు , పి.లక్ష్మీక 568 మార్కులు ,ఆర్ శృతి 567 మార్కులు ,డి. షాలిని 566 మార్కులు, వి.సిరి 562 మార్కులు, ఎం.యోగ శ్రీ 562 మార్కులు సాధించినందుకు పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు. ప్రిన్సిపల్ ఎ.శోభారాణి ప్రకటన చేస్తూ ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాలలో 76 మంది విద్యార్థినిలకు 76 మంది పాస్ అయ్యారని తెలిపారు. అలాగే 17మంది విద్యార్థినులు 540 పైగా మార్కులతో, 44 మంది విద్యార్థినులు 500 పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. సెక్రెటరీ,ఆర్‌సిఒ, డిసిఒ సహాయ సహకారాలు అందించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## పదో తరగతి ఫలితాలలో ఆర్బిట్ ప్రభంజనం

ప్రజాపక్షం/హసన్ పర్తి : మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామం పరిధి ఆర్బిట్ ఇ టెక్నో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు బుధవారం వెలువడిన పదవతరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించారని ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్ రెడ్డి తెలిపారు. అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులలో ఎం. వినీల్ రెడ్డి581, టి. సంజనారెడ్డి580, ఏ. విశాల్ రెడ్డి 573 మార్కులు సాధించారని, అంతేకాకుండా 120 మంది విద్యార్థులలో 90 మార్కులకుపైగా సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

## దళితరత్న అవార్డు అందుకున్న కోర్నెల్

ప్రజాపక్షం/ఆత్మకూరు : ఎస్సీ కార్పొరేషన్ చైర్ పర్సన్ నాగ ప్రీతం చేతుల మీదుగా దళితరత్న అవార్డును ఆత్మకూర్ నివాసి నత్తి కోర్నెల్ అందుకున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మదిన సందర్భంగా సోషల్ ఆర్గనైజేషన్, ప్రజా సంఘాలలో పనిచేసిన క్రియాశీల వ్యక్తులకు దళితరత్న అవార్డు ప్రధానం చేస్తారు. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు ఆధ్వర్యంలో ఎంపిక చేయబడినటువంటి వ్యక్తి నత్తి కోరనేల్ ఆత్మకూరు కావడం ఆత్మకూరు పురజనులకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తనకు దళితరత్న అవార్డు రావడానికి సహకరించిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగ ప్రీతం, తనకు సహకరించిన పరకాల నియోజవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, ఈస్ట్ శాసనసభ్యులు హనుమకొండ డిసిసి అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, ఎస్సీ డిపార్ట్మెంట్, టిపిసిసి కార్యదర్శి ఎస్సి డిపార్ట్మెంట్ స్టేట్ కన్వీనర్ దళితరత్న దబ్బెట రమేష్, మల్యాల్గిరి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ పత్తి కుమార్ తదితరులు సహకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

## త్వరలోనే...గజ్వేల్‌కు మంత్రి తుమ్మల రాక



ప్రజాపక్షం/గజ్వేల్;రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం కొండపాక, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్లతో కలిసి మంత్రిని గజ్వేల్ నియోజకవర్గ పర్యటనకు ఆహ్వానించారు. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 10వ తేదీలోపు గజ్వేల్ పర్యటనకు రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మార్కెట్ కమిటీల సన్మాన కార్యక్రమంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డి తెలిపారు. మొదటగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్తలు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించగా, నాయకులు సాజిద్ బేగ్, రాజేశ్వర్ గుప్త, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాటాలు జరపాలి



ప్రజాపక్షం/సదాశివపేట: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే 1న మే డే ను ఊరూర వాడ వాడాలా అరుణ పతాకాన్ని ఎగరవేసి ఘనంగా జరుపుకోవాలని శ్రామిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలని ప్రతిన భూనాలని భారతీయ కేత్ మద్దూరు యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంతాజుద్దీన్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 139 సంవత్సరా క్రితం అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినాల కోసం కార్మికులు జరిపిన పోరాటంలో రక్త తర్పణం చేసి అసువులు బాసిన అమరవీరుల త్యాగంతో స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా ,దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఎన్నో పోరాటాలు చేసి కార్మిక హక్కులను సాధించారన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను నేటి నాయకులు కాలరాస్తున్నన్నరన్నారు. పెట్టుబడి దారీ దోపిడి వర్గాలకు ఊడిగం చేస్తూ చేస్తూ కార్మికుల హక్కులను రద్దు చేయడం, కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ప్రయోజనాలకు భంగం కలిగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. దోపిడి వ్యవస్థను అంతం చేసి ఒక మనిషిని మరొక మనిషి దోపిడి చేయుటకు వీలు లేని సమ సమాజం నిర్మాణం కోసం పోరాడేందుకు మే డే దినోత్సవం సందర్భంగా సకల కార్మికులు ఏకం కావాలని తాజుద్దీన్ విజ్ఞప్తి చేశారు. అలాగే ఏఐటియు మండల కార్యదర్శి , కార్మికుల దినోత్సవం గురించి చక్కగా వివరించారు. కార్మికులంతా ఏకం కావాలని, హక్కుల గురించి పోరాటాలు జరపాలని వివరించారు. కార్యక్రమంలోప్రియాంక ,తస్లీం, తదితరులు పాల్గొన్నా రు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న పాలకవర్గాలు

ప్రజాపక్షం/కొమురవెల్లి:సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో పాలకవర్గ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు.గురువారం 139వ మేడే ఉత్సవాలలో భాగంగా కొమురవెల్లి మండల కేంద్రంలో మండల కార్యదర్శి బాల్ మోహన్ చేత జెండా ఆవిష్కరించారు.అనంతరం ఐనాపూర్, కొమురవెల్లి, రాంసాగర్, రసులాబాద్ గ్రామాలలో జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో 1886 మే నెలలో కార్మికులు 8 గంటల పని దినానికై హే మార్కెట్‌లో సాగిన కార్మికుల మెరుపు సమ్మెపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఎంతో మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని అదే స్పూర్తితో అమరులను స్మరిస్తూ ప్రతీ ఏటా మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జరుపుతామన్నారు.కార్మిక సంఘాలు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడులుగా విభజించి చట్టాల సవరణల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ కొమురవెల్లి మండల కార్యదర్శి , సత్తయ్య, రాజు, సంతోష్, అనిల్, సిద్ధయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కర్షక, కార్మిక రాజ్యం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

### భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం



ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి : కార్మిక, కర్షక రాజ్యం కోసం కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. మేడే ప్రపంచ కార్మిక దినోత్సం పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్న గతంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నేరవేర్చటంలో విఫలమైందన్నారు. కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ సైతం నేరవేర్చలేదన్నారు. కార్మికుల సమస్య పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం దరిపల్లి కార్మికులతో కలసి కార్మిక జెండాను ఆవిష్కరించారు.కార్యక్రమంలో జిల్లా , మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



ప్రజాపక్షం/పాలకుర్తి: మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు రంగినేని సత్యనారాయణ రావు ఏకైక పుత్రిక నీరజ, వెంకట్ శంతన్‌రావు వివాహం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో జరిగిన వివాహ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పవీన్, నాయకులు నాగిరెడ్డి, శ్రీనివాసరావు, పాపారావు, ఎల్లయ్య, యాకయ్య, తదితరులున్నారు.

**పరామర్శించిన ఎర్రబెల్లి...**

మండలంలోని టీఎస్‌కే తండాకు చెందిన బక్కమ్మ పాముకాటుకుగురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందగా గురువారం ఆమె మృతదేహంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట బాలు నాయక్, కుటుంబ సభ్యులు, తదితరులున్నారు.

## విడిభాగాల బహిరంగ వేలం

### జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్

ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :జిల్లా పోలీసు వాహనాలకు వినియోగించిన విడి బాగాల బహిరంగ వేలం వేయుచున్నట్లు ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొని విడిభాగాలను సొంతం చేసుకోవచ్చునని జిల్లా ఎస్‌పిపరితోష్ ఫంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పోలీసు వాహనాలకు వినియోగించిన కాలం చెల్లిన విడిభాగాలను తేది 08052025 నాడు ఉదయం 10.00 గంటలకు జిల్లా పోలీస్ ఎఆర్‌హెడ్ క్వార్టర్స్ నందు బహిరంగా వేలం వేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈ వేలం పాట నందు పాల్గొని వాహన విడిభాగాలను సొంతం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల వారు మిగిత వివరాల కోసం కృష్ణ, 9908847637,సాయి తేజ పిసి8179412752 సంప్రదించవలెనని, వేలం పాటలో టైర్స్ ,ట్యూబ్స్ , బ్యాటరీలు, ఇతర వాహన విడిభాగాలు ఉన్నవని తెలిపారు.

# దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి

### ఎల్కతుర్తి సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు

ప్రజాపక్షం /ఎల్కతుర్తి :మేడే సందర్భంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో గురువారం మేడే ఉత్సవాలను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రే లక్ష్మణ్, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు వీరి ఆధ్వర్యంలో ఎరుపెక్కిన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు, శ్రమజీవులకు కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రపంచవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్రమైన పరిస్థితులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల జ్ఞాపకార్థంగా మేడే జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. చికాగో నగరంలో పెట్టుబడిదారీ వర్గానికి, కార్మిక, కర్షక వర్గానికి జరిగిన పోరాటంలో ఎంతోమంది అమరులైనరని ఆయన అన్నారు.ఆ అమరుల రక్తపు మడుగుల నుంచి ఎత్తిన జెండానే ఎర్రజెండా అని సూచించారు.ఈ ఎర్ర జెండాకు కర్షకులకు సుత్తి, కార్మికులకు కొడవలి వీరికి చిహ్నమని ఆయన అన్నారు.ఈ మేడే ఉత్సవాలు.మండల కేంద్రంతో పాటు గోపాలపూర్, జీలుగుల, పెంచికలపేట, జగన్నాధపురం, కేశపూర్, తదితర గ్రామాలలో మేడే ఉత్సవాలు జండా ఆవిష్కరించి జరుపుకోవడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి వధువుకు పుస్తె మట్టెలు అందజేత

ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : ధూల్మిట్ట మండలకేంద్రంలోని నాయిబ్రాహ్మణ కుటుంబానికి చెందిన కొండూరి గీత కొండల్ కుమార్తె శాలిని (దక్షిత) వివాహానికి ధూల్మిట్ట గ్రామ నాయకులు గునుకుల జగన్మోహన్ రెడ్డి హాజరై గ్రామ నాయిబ్రాహ్మణులతో కలసి దక్షితకు పెళ్లికి కావల్సిన పుస్తే మట్టెలను జగన్మోహన్ రెడ్డి అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలోని అనేక మంది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయాలను అందిస్తూ, స్వచ్ఛంద సేవలను నిర్వహిస్తున్న గునుకుల జగన్మోహన్ రెడ్డి శాలిని వివాహానికి సహాయం చేసిన సందర్భంగా వధువు కుటుంబ సభ్యులతో పాటుగా, ధూల్మిట్ట గ్రామ నాయిబ్రాహ్మణులు ధన్యవాదాలు తెలుపుతూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధూల్మిట్ట గ్రామ నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కొండూరి రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షులు సత్తయ్య, మండల అధ్యక్షులు అరవింద్ కుమార్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల గౌరవ అధ్యక్షులు కొండూరి సతీష్‌కుమార్, నాయకులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్



ప్రజాపక్షం/కొండపాక:కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన విరుపాక శ్రీనివాస్ రెడ్డి మంత్రిని కలిసి ఆశీస్సులు తీసుకున్నాడు.వారి వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## పెద్దమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట

ప్రజాపక్షం/మనోహరాబాద్:మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో ముదిరాజ్ కులస్తులు నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి దేవాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాచారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ హాజరై అమ్మవారికి వడి బియ్యం సమర్పించి, పట్టు వస్త్రలు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి వచ్చిన ముఖ్య అతిథులకు ముదిరాజ్ కులస్తులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి తలారి బిక్షపతి ముదిరాజ్, యువజన పోలిట్ బ్యూరో సభ్యులు లింగ సత్యనారాయణ ముదిరాజ్, మనోహరాబాద్ మండల్ ముదిరాజ్, మహాసభ అధ్యక్షులు దాసరి నరేష్ కుమార్ ముదిరాజ్, నాయకులు బస్తీ సత్యనారాయణ, వెంకటయ్య, ఆంజనేయులు, స్వామి, వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన సురకంటి విష్ణువర్ధన్‌రెడ్డికి మంజూరు అయిన రూ. 60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతులమీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ సర్పంచ్ ఏనుగు అశోక్‌రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, శైలేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# కార్మిక అమరుల రక్త తర్పణమే మేడే



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** శ్రమ దోపిడికి వ్యతిరేకంగా 8 గంటల పని విధానం కోసం దినసరి వేతనం పెంపు కోసం కార్మిక శక్తులు సంఘటితమై మహోద్యమం సాగించి అమరుల రక్త తర్పణంతో ఏర్పడిన దినమే మేడే ప్రపంచ కార్మిక దినోత్సవమని సిపిఐ మద్దూరు మండల కార్యదర్శి జంగిలి యాదగిరి, ధూల్మిట్ట మండల గ్రామపంచాయితి అద్యక్షులు కొండూరి రాజ్ కుమార్, జాలపల్లిలో ఎంపిటిసి చెట్కూరి కల్యాణి కమలాకర్, సర్పంచ్ చొప్పరి వరలక్ష్మి సాగర్‌లు అన్నారు. ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండల కేంద్రాలతో పాటుగా పలు గ్రామాలలో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఘనంగా నిర్వహించారు. మద్దూరు మండలకేంద్రంతో పాటుగా సలక్‌పూర్, రేబర్తి,లద్నూర్,మర్మాముల ధూల్మిట్ట మండల కేంద్రంలో ఆటో, తాపిమేస్త్రీ, మరియు హమాలి, కార్మిక సంఘాల ఆద్వర్యంలో జాలపల్లిలో తాజామాజీ ఎంపిటిసి చెట్కూరి కల్యాణి కమలాకర్, సర్పంచ్ చొప్పరి వరలక్ష్మి సాగర్, కూటిగల్ దోమ బాలమని, బాలకృష్ణ, వలంపట్లలో ఆలేటి రజిత,యాదగిరిలు కార్మికులతో కలిసి మేడే లో పాల్గొని ఎర్ర జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చికాగో నగరాన హే మార్కెట్లో కార్మికులంతా మహ ప్రభంజనమై తమ హక్కుల కోసం పెట్టుబడి దారులను మట్టి కరిపించి అనేక మంది కార్మికుల రక్తంలో నుండి పుట్టిన జెంధనే ఎర్ర జెంధ అని ఆ రోజే ప్రపంచ కార్మికుల దినోత్సవంగా కార్మికులంతా మేడేగా జరుపుకుంటున్నారని అన్నారు. ప్రపంచ కార్మికులంతా ఏకంకండి పోరాడితే పోయేది భానిస సంకెళ్ళు తప్పాఅని నినాధాలు ప్రతిధ్వనించిన రోజు అని గుర్తు చేశారు. మేడే స్పూర్తితో ప్రపంచ వ్యాప్తంగా కార్మిక లోకం పోరాటాలు నిర్వహించిందని, భారత దేశంలో కూడా కార్మికులంతా 8 గంటల పనిదినం కోసం ఉద్యోగ భధ్రత సమాన పనికి సమాన వేతనం వంటి అనేక హక్కులను కార్మిక సంఘాల అగ్రగామి భారత దేశంలో తొలి కార్మిక సంఘం ఎఐటియుసి నేతృత్వంలో కార్మికులు ఉద్యోగాలు సాధించుకున్నారని అన్నారు .శ్రామిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు కార్మిక చట్టాలను పునరుద్దరించేందుకు నిరంతరం కార్మికులు పోరాటం చేయాలని అన్నారు. ఆయా కార్మికసంఘాలనాయకులు,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కౌడిపల్లిలో నూతన కార్మిక భవనం ప్రారంభం



**ప్రజాపక్షం/కౌడిపల్లి:**కార్మికులు సంఘటితంగా ఉంటే తమ హక్కులను సాధించుకోవచ్చని మెదక్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి అన్నారు. గురువారం మే డే ను పురస్కరించుకొని మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామ శివారులో భవన కార్మికుల నూతన తాత్కాలిక భవనం సుహాసిని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సుహాసిని రెడ్డి మాట్లాడుతూ, కార్మికులు సంఘటితంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోవచ్చని సూచించారు. కార్మిక సంఘాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే నెల రోజుల వ్యవధిలో నూతన కార్మిక భవనం వద్ద బోరుబావి వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల భవన నిర్మాణ కార్మికులు సుహాసిని రెడ్డిని అతిథులు మాజీ సిడిసి చైర్మన్ చిలుముల దుర్గారెడ్డి, యువ నాయకులు పోల నవీన్ కుమార్,నందిని ట్రేడర్స్ ప్రొప్రైటర్ రాగుల భూమయ్య, శ్రీ లక్ష్మీనరసింహ ట్రేడర్స్ ప్రేపరేటర్ బాలగోని విట్టల్ గౌడ్, మాజీ కౌడిపల్లి బిఆర్ఎస్ నాయకులు బిసా పురుషోత్తం కు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కౌడిపల్లి గ్రామ పంచాయతీ కార్మికులు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా కార్మిక జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఉమ్మడి మండల నాయకులు అడ్వకేట్ చిరంజీవి, మండల కార్మిక సంఘం ఉపాధ్యక్షులు మల్లేశం, ప్రధాన కార్యదర్శి గౌడి చర్ల ప్రశాంత్, కోశాధికారి కె.శ్రీనివాస్, సభ్యులు గౌడిచర్ల వెంకటేశం, జావేద్, నాసర్ ఖాన్, మల్లేశం, సత్యనారాయణ, కళ్యాణ్, బాలకిషన్, మల్లికార్జున్, రవి, సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన తిరుపతిరెడ్డి



**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన యాడారం లత, లింగా గౌడ్‌ల కుమార్తె శ్వేత వివాహానికి బుధవారంటిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నియోజకవర్గ ఇంచార్జ్ కంఠా రెడ్డి తిరుపతిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలోమండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్, నస్కల్ మాజీ సర్పంచ్ విజయ్, దుబ్బ రాజా గౌడ్, కేశల యాదగిరి, నగేష్, వెంకటస్వామి గౌడ్,నగేష్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** జిల్లా వ్యాప్తంగా అన్ని నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సంగారెడ్డిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ,జె.ఎన్,టియు, ఐఐటి కెవి. స్కూల్ ఓడియఫ్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్‌పి పరతోష్ ఫంకజ్, వివరించారు. జిల్లాలో మొత్తం 7 పరీక్ష కేంద్రాలలో 3320 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని మద్యాహ్నం 25 గంటల వరకు జరగనున్న ఈపరీక్ష కేంద్రంలోనికి ఉదయం 11 నుండి మద్యాహ్నం 01.30 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను అనుమతించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 125 బియస్ యస్ యస్ (144) సెక్షన్ అమలులో ఉంటుందని సెంటర్ల వద్ద గుంపులు,గుంపులుగా తిరగడానికి వీలులేదని తెలిపారు. అభ్యర్థులు ఇన్విజిలేటర్స్ ఎవ్వరూ ఎలక్ట్రానిక్స్ పరికరాలను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకురాకూడదని, పరీక్ష కేంద్రం సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని ఎస్‌పి గుర్తుచేశారు. **అభ్యర్థులకు సూచనలు:**అభ్యర్థులు అడ్మిట్ కార్డ్‌తో పాటు గుర్తింపు కార్డ్ పాస్ ఫొటో సైజ్ ఫొటోలు 2 పోస్ట్ కార్డు సైజ్ ఫొటో 1 పారదర్శకంగా/ ట్రాన్స్పరెంట్ గా ఉండే వాటర్ బాటిల్ తీసుకొని రావాలి

బంగారు వెండి తదతర నగలు వేసుకొని రాకూడదు. షూస్‌సాక్స్ వేసుకొని రాకూడదు. ఆడ్మిట్ కార్డు నందు సూచనలు పాటిస్తూ పరీక్ష కేంద్రాలకు సకాలంలో హాజరు కావాలని జిల్లా ఎస్‌పిఅభ్యర్థులకు సూచనలు చేశారు. ఈ సందర్శనలోఎస్‌పి వెంబడి సంగారెడ్డి, డిఎస్‌పి,జోగిపేట సిఐ ,తదితరులున్నారు.

## మేడే స్ఫూర్తితో ఉపాధి హామీ హక్కులను కాపాడుకుందాం

### డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పిలుపు

**ప్రజాపక్షం/గజ్వేల్;**మేడే కార్మిక పోరాట దినం స్పూర్థితో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హక్కులను పరిరక్షించుకుందామని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ మండంల బయ్యారంలో ఉపాధి కూలీల సమక్షంలో మేడే సంబారాల సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగ బద్దంగా వచ్చిన కార్మిక, కర్షకుల హక్కులను కేంద్ర ప్రభుత్వం లేబర్ కొడ్ పేరుతో సామాజిక బద్రత లేకుండా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో 100 నుండి 200 రోజులకు పెంచాలని, వేతనాలు రూ.317 నుండి రూ 700 వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా పనిముట్లను ఇవ్వాలని, నీరు, నీడ వసతులు కల్పించాలని, ఎన్ఎం ఎంఎస్ ను ఎత్తివేయాలని, గతంలో ఉన్న సమ్మర్ అలవెన్స్ యధావిధిగా ఈ సంవత్సరం కుడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి , జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, ఎఫ్ఎ మైసని మల్లయ్య, నాయకులు మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన పెద్దమ్మతల్లి ఉత్సవాలు

**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం అయినటువంటి పెద్దమ్మ తల్లి ఆలయ ఆరవ వార్షికోత్సవంలో భాగంగా మొదటి రోజు గణపతి హోమం, పుట్టమన్ను తెచ్చుట, హోమం, అభిషేక కార్యక్రమాలు చేపట్టారు. మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాలలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికృపకు పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర నిర్ణయం

**ప్రజాపక్షం/గజ్వేల్:**దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం బిజెపి బీసీ మోర్చా ఆధ్వర్యంలో నేతలు ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి శాఖ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గర్నేపల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయింతో బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్స్ పెంచడంతో పాటు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమని, సామాజిక సమరసతను దృష్టిలో ఉంచుకుని జనగణనలో భాగంగా కులగణనకు చర్యలు తీసుకుంటూ ఉండడం శుభ పరిణామమని చెప్పారు. కాగా కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు బీసీలు గుర్తుకు రాలేదని ఎద్దేవా చేస్తూ, అధికారం లేనప్పుడు బీసీల పేరుతో రాజకీయ పబ్బం కడుకోవాలని చూస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు కులగణన పేరుతో స్వార్థపూరిత రాజకీయాలకు తెరలేపగా, రాజకీయ అస్త్రంగా వాడుకుని ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేందుకు ప్రయత్నించాయని ఆరోపించారు. కానీ, ప్రజాప్రయోజనాలను కాపాడే విషయంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుంత్వ చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నత్తి శివకుమార్, ఒబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు , మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి , నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు బిటి రోడ్డు నిర్మాణ పనులు



**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ రాంపూర్ నందగోపాలం చల్మెడ మీదుగా కమాన్ వరకు గత మూడు సంవత్సరాలుగాబిటిరోడ్డు పనులకై ప్రారంభం చేసి ప్రభుత్వాలు మారిన అనంతరం పనులు ప్రారంభం కాకపోగా గత జనవరి 11వ తేదీ నుండి దాదాపు 15 రోజులు నష్టం గ్రామానికి చెందిన యువకులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించగా అందుకు స్పందించిన మైనంపల్లి హనుమంతరావు రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తానని రిలే నిరాహార దీక్షలు ఆపాలని తెలపగా నిలుపుదల చేయడంతో 20 రోజుల తర్వాత పనులు ప్రారంభించడం జరిగింది. రెండు నెలల పాటు అరకోరా గా సాగిన పనులు ఎట్టకేలకు మే మొదటి రోజునా బిటి రోడ్లు పనులు ప్రారంభం కావడంతో యువకులు గ్రామస్తులు మైనంపల్లి హనుమంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 20 సంవత్సరాల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు.

## దుర్గమ్మ సన్నిధిలో నర్సాపూర్ జడ్జ్

**ప్రజాపక్షం/పాపన్నపేట:**ఏడుపాయల వన దుర్గ భవానీ మాతను నర్సాపూర్ ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్టేట్ హేమలత గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమెకు ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి వారి పేర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట వేద పండితులకు శంకర శర్మ, పార్థివ శర్మతోపాటు ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, బత్తిని రాజు, వరుణాచారి, నర్సింలు తదితరులున్నారు.

## మహిళా సాధికారితకు పెద్దపీట: కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** జిల్లాలో మహిళా సాదికారతకు పెద్ద పీట వేస్తున్నట్లు జిల్లా కలక్టర్ క్రాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతివల్లూరు మాట్లాడుతూ జిల్లాలో మహిళా సాదికారతలో భాగంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా డ్రోన్లు ,మహిళా పెట్రోల్ బంకులు , కమర్షియల్ కాంప్లెక్సు ,ఇటుక తయారీ , విద్యార్థులకు ఏకరూప ,దుస్తుల కుట్టు లాంటి కార్యక్రమాలు జిల్లాలో మహిళలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. మహిళా సంఘాల ,మహిళలు వారి ఉత్పత్తులైన లక్క బొమ్మలు, జాబ్ బ్యాగులు, తయారు చేసి సంగారెడ్డి జిల్లా పేరు మీద మంజీరా మహిళా శక్తి అనే స్టాల్ ను శిల్పారామంలోఏర్పాటుచేసి వాటిని విక్రయించే జిల్లాకు దేశవ్యాప్తంగా గుర్తింపు తేవాలన్నారు. న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల్లో ఉన్న మహిళలందరు. తప్పని సరిగా వంద శాతం అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. డ్రోన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు 80 శాతం సబ్సిడీ కింద డ్రోన్లు అందించాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహిళా పెట్రోల్ బంకుల్ని ఈ నెలలో ప్రారంభించుకోవాలన్నారు. క్యాబ్ డ్రైవర్లు గా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. టూ వీలర్ ,4 వీలర్, లాంటి వాహనాలను నడిపించే ఆసక్తి ఉన్న వారిని హైదరాబాదులో ఉన్న శిక్షణ కేంద్రంలో శిక్షణ కల్పించి ఆర్థిక సహాయం అందించి ఉపాది కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిడిడి ఆర్‌డిఏ జ్యోతి పిడి మెప్మా, గీత సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వాడవాడలా ఘనంగా ‘ మేడే ’ఉత్సవాలు



**మనోహరాబాద్:**ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ను పురస్కరించుకొని మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి ఐటీఎల్ పరిశ్రమ, రామాయిపల్లి ఇండస్ మెడికేర్ పరిశ్రమ,టోల్ ప్లాజా కార్యాలయం వద్ద గురువారం కార్మిక దినోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూనియన్ అధ్యక్షులు చిట్కుల మహిపాల్ రెడ్డి హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే కార్మిక సంఘాలు బలోపేతం అవుతాయని, దీని ద్వారా రాష్ట్ర, కేంద్రంలో కార్మిక హక్కులను సాధించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూపల్లి మల్లారెడ్డి, మండల మైనారిటీ అధ్యక్షులు సొసైటీ డైరెక్టర్ జావిద్ పాషా, నాయకులు , తూప్రాన్ మాజీ ఎంపిపి స్వప్న వెంకటేశ యాదవ్,యూత్ అధ్యక్షుల్లు తదితరులు పాల్గొన్నారు.



**మనోహరాబాద్:**మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు వీరబోయిన సత్యానారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం కార్మికుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మే డే ని పురస్కరించుకొని జాతీయ రహదారి వద్ద కార్మికులతో కలిసి సత్యనారాయణ ముదిరాజ్ జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులు తమ హక్కులను కాపాడుకోవడానికి అందరూ ఏకం కావాలని ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే మొదటి రోజు కార్మికుల దినోత్సవం జరుపుకుంటారని పేర్కొన్నారు. అనంతరం కళ్ళకల్ గ్రామం నుండి ముప్పిరెడ్డిపల్లి, జీడిపల్లి, కూచారం గ్రామాలలో భారీ సంఖ్యలో కార్మికులంతా కలిసి బైకు ర్యాలీ నిర్వహిస్తూ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక



సంఘం ఉపాధ్యక్షులు కుమ్మరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కర్రి శ్రీనివాస్, కోశాధికారి ఎర్ర శ్రీనివాస్, మండల సెక్రెటరీ కట్కే కిషన్, గౌరవ అధ్యక్షులు యెషం వెంకటేష్, సభ్యులు తొంట శంకర్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్:**నియోజకవర్గ పరిధిలో 139 వ కార్మిక దినోత్సవం సందర్భంగా ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా సెక్రెటరీ శివలింగు కృష్ణ ఆధ్వర్యంలో గ్రామాలల్లో ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. జాలిగామా, బయ్యారం, లింగరాజుపల్లి, గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్, వేములఘట్, సింగారం గ్రామాలలో కార్మిక దినోత్సవం వేడుకలు నిర్వహించి కార్మికుల హక్కులపై చైతన్యం చేశారు. ముఖ్యంగా కార్మికుల అభ్యున్నతికి కృషిచేస్తూ పోరాట పటిమ చాటుతామని అన్నారు. నిరంతర శ్రమను నమ్ముకున్న కార్మికులకు ప్రభుత్వాలు కూడా సానుకూల ధోరణితో వ్యవహరించాలని కోరారు.





**బెజ్జంకి:**కార్మిక వ్యతిరేక విధనాలను తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకటరెడ్డి,మండల కార్యదర్శి బోనగిరి రూపేష్‌లు అన్నారు.గురువారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సిపిఐ,ఏఐటియూసి ఆధ్వర్యంలో పార్టీ జెండానూ ఎగురవేసి 139వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు,బోనగిరి శ్రావణ్,ఏఐవైఎఫ్ మండలాధ్యక్షులు దొంతరవేణి మహేష్,నాయకులు బాలమల్లు,పర్శరాములు,రవిందర్,బాలయ్య,చంద్రయ్య,రమేష్,హమాలి కార్మికులు,పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.





**నిజాంపేట్:**నిజాంపేట మండల కేంద్రంలో గురువారం మేడే పురస్కరించుకుని హమాలీ సంఘం గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికుల ఆధ్వర్యంలో సిపిఎం జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడిన కార్మికుల విజయ గీతిక శ్రమజీవుల సంఘటిత ప్రతీక మేడే అని కార్మిక సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షులు బాగులు ఉపాధ్యక్షులు సురేందర్, కోశాధికారి ఎల్లం, సిపిఎం నాయకులు నవీన్, పారిశుద్ధ కార్మికులు ఇందిరా, కుమార్, హమాలి సంఘం జిపి కార్మికులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



**సంగారెడ్డి ప్రతినిధి:** సంగారెడ్డిలో సంగారెడ్డి అయిల్ పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే డే సందర్భంగా గురువారం ఏఐటియుసి జెండాను ఆ శాఖ యూనియన్ నాయకులు వి.నర్సింలు ఆవిష్కారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని పిలుపు నిచ్చారు. మే డే రోజున శ్రమ శక్తిని ఏకం చేసిన రోజు అని శ్రమ దోపిడి బాసిన బతుకులకు స్వస్తి చెప్పిన రోజుని కార్మికుల హక్కుల సాధన ,సహకారం చేసిన రోజు మే డే అని అన్నారు. ఈ కార్యక్రమంలో అద్యక్షులు వెంకటేశం, ఉపాద్యాక్షులు ఎండిసాబేర్, కార్యదర్శి బి.నరేందర్, సహాయ కార్యదర్శి. వి. నర్సింలు , కోశాధికారి పి.సాయిలు,భుజంగం,చక్రవర్తి ,వినయ్‌కుమార్, వీరన్న, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

**రఘునాథపల్లి:** ప్రపంచ కార్మికుల దినోత్సవ సందర్భంగా సీపీఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి జెండాను ఆవిష్కరించి మేడే త్సవాలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని గ్రామాలు గబ్బెట, కంచనపల్లి, కోడూరు, బానాజిపేట, తదితర గ్రామాలలో మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్మంలో సీపీఐ మండల నాయకులు సోమన్న, సోమయ్య, అంజయ్య, వెంకటేశ్వర్లు, అశోక్, రాములు, నర్సిరెడ్డి, రమేష్, నాగేష్, రేణుబాబు, శ్రీనివాస్, బుచ్చన్న, డానియేల్, మల్లేశం, దావీదు, ఉప్పలయ్య, అమ్మాజీ, శ్రీనివాస్, ఎల్లయ్య, జయమ్మ, కీర్తిక, ఎల్లయ్య, మధు, తదితరులు పాల్గొన్నారు.

**కొడకండ్ల:** మే డే సందర్భంగా మండల కేంద్రంలో బస్టాప్ చౌరస్తా వద్ద హమాలీ కార్మికులతో కలిసి ఏఐటీయూసి





మండల అధ్యక్షులు ఉడుత సుదర్శన్ మేడే జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కార్మికులకు అనేక సంక్షేమ పథకాలను అందించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, దర్గయ్య, సోమయ్య, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

**జఫర్‌గడ్:** మండలంలోని తిమ్మంపేట, తిమ్మాపూర్, హిమ్మత్‌నగర్, తీగారం, తమ్మడపల్లి గ్రామాలలో మేడే కార్మికుల దినోత్సవ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోమయ్య హాజరై మాట్లాడారు. తిమ్మంపేట గ్రామానికి చెందిన హమాలీ సంఘం, ఆటో కార్మిక సంఘం పలువురు కార్మికులు గురువారం సీఐటీయూ కార్మిక సంఘంలో చేరడం జరిగింది. సీఐటీయూలో చేరిన వారిలో శంకర్, రమేష్, కృపాకర్, యాదగిరి, 8మంది చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లయ్య, అబ్బమైన మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

**సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో...**

మండలంలోని పలు గ్రామాలలో మేడే పండుగ వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో సీపీఐ జెండాలను ఎగురవేయడం జరిగింది. అనంతరం కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎండీ యాకూబ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు సమ్మయ్య, జాఫర్, బుచ్చయ్య, సాయిలు, ముసలయ్య, రాములు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

**దుగ్గొండి:** మండలంలోని రేఖంపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ సెంటర్లో హమాలీ కార్మికుల ఆధ్వర్యంలో మేడే సందర్భంగా ఇఫ్టూ జెండాను గట్టికొప్పుల ఐలయ్య జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు జక్కుల తిరుపతి, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం ప్రభుత్వంపై రాజీలేని పోరాటాలు చేయాలని, పోరాడితే పోయేది ఏమీ లేదని, సంఘటిత, అసంఘటిత రంగంలో కార్మికులు లక్షలాది కార్మికులకు ఎలాంటి భద్రత, రక్షణ లేకుండా, సరైన వసతి లేకుండా పనిచేస్తున్నారని, హమాలీ కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటుచేయాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర అన్నారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ బొమ్మరబోయిన రాజేందర్, కొత్తూరు ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా మే డే ఉత్సవాలు

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** పోరాటం ద్వారానే హక్కులు సాధించుకోవడం జరుగుతుందని, కార్మిక, కర్షక హక్కులకై నిరంతరం కృషస్తా చేద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు యాటాల సోమన్నలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో వాడవాడనా వివిధ రంగాల కార్మికులు ఎర్రజెండా ఎగురవేసి ఘనంగా మే డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా నుండి నెహ్రూ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కామాక్షి ఫంక్షన్ హాల్‌లో సభను నిర్వహించారు. ఈ సభకు సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను, గ్రామీణ బందును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు, సీపీఎం జిల్లా నాయకులు అహల్య, శేఖర్, గోపి, ఉపేందర్, గణేష్, అజారుద్దీన్, వెంకటమల్లయ్య, లింగం, తదితరులు పాల్గొన్నారు.



**జనగామ ప్రతినిధి:** జిల్లా కేంద్రంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ దగ్గర టీఎన్‌టీయూసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేరిపోతుల కుమార్ ఆధ్వర్యంలో తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కార్మికుల జెండా ఎగురవేసి మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లేష్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, సురేష్, కొమురయ్య, కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

**మంగపేట;**మంగపేట మండలంలోని కమలాపూర్ బిల్ట్ కార్మికుల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కార్మిక నాయకులు విజయరావు జెండా ఆవిష్కరణ చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ, బిల్ట్ యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, దీనికి కార్మికులందరం ఐక్యత కావలసిన ఆవశ్యకత ఉందని మన హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేయడానికి ఐక్య సంఘటనగా ఏర్పడి ఉద్యమాలు చేయాలని కార్మికుల్ని కోరారు. ఈ సందర్భాన్ని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బాధావత్ రాజు మాట్లాడుతూ దేశ సౌభాగ్యం కోసం, సార్వభౌమత్వం కోసం, దేశ ఆర్థిక పరిపుష్టి కోసం, సమాజ అభివృద్ధి కోసం అనునిత్యం వారి చెమటను ధారపోస్తూ శ్రమించిన కార్మికులు యాజమాన్యంకు ఒంటెద్దు పోగోడాల కారణంగా, వారి స్వలాభం కోసం కర్మాగారాలను మూసివేస్తూ కార్మికుల యొక్క హక్కులను కాలరాస్తూ వారు కోట్లకు పండగలేత్తుతున్నారు 2019లో బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ల కారణంగా కార్మికులకు కాస్త కూసో ప్రయోజనం కల్పిస్తున్న 44 చట్టాలను నిర్వీర్యం చేసి వాళ్ల యొక్క హక్కులను కాలరాసింది. దేశంలోని 90 శాతం మంది కార్మికులు అసంఘటిత కార్మిక రంగంలో పనిచేస్తున్న వారికి ఎటువంటి హక్కులు లేకపోగా సంఘటిత రంగంలో పనిచేస్తున్న 10 కార్మికులకు కూడా ఉన్న హక్కులు కాలరాయపడ్డాయి. కావున కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం నాలుగు లేబర్ చట్టాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేసినప్పుడు మాత్రమే వాళ్ళ హక్కులు కాపాడబడతాయని కార్మికులందరికి మే డే శుభాకాంక్షలు తెలుపుతున్నామని అయన కోరారు. సమావేశంలో మానవ హక్కుల సభ్యులు సమ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు చంద్రగిరి శంకర్, తెలంగాణ రైతు కూలి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, బిల్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థినులు అత్యున్నత స్థాయికి ఎదగాలి:ఎస్ఐసురేష్

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలకేంద్రానికి చెందిన పత్తిపాక హాసిని కరుణాపురం మహాత్మాజ్యోతీరావుపూలె బాలికల పాఠశాలలో పదవతరగతి పరీక్షలలో 575 మార్కులు సాధించినందుకు గ్రామానికి చెందిన పలువురు అభినందించగా గొల్లకిష్టంపల్లిలోని కస్తూర్బగాంధి బాలికల విద్యాలయ విద్యార్థిని కె వర్షిణి 521 మార్కులు సాధించినందుకు వేలేరు ఎస్ఐ సురేష్ వర్షిణిని శాలువాతో సన్మానించి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావిభారతపౌరలని కొనియాడుతూ ప్రభుత్వపాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన వీరు అత్యున్నత స్థాయికిఎదిగి ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపాలని కోరారు.

# పది ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా అగ్రగామి

**పదవ తరగతిలో ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు రెండవ స్థానం**

**జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో 99.09 శాతంతో ఉత్తీర్ణత**

**జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:**బుదవారం మద్యాహ్నం పదో తరగతి పరీక్షా ఫలితాలలో సంగారెడ్డి జిల్లా రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాదించింది. ఈ సంవత్సరం 99.09 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 2 వ స్థానంలో నిలవడం ఉత్తమ ఫలితాల దిశగా సరికొత్త వరవడి సృష్టించిందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు క్రాంతి అన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ తన చాంబర్‌లో రాష్ట్ర స్థాయిలో పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి,జిల్లా ద్వితీయ స్థానం సాధించినందుకు ప్రభుత్వ పాఠశాలలో చదివిన మొదటి నాలుగు స్థానాలు సాదించిన విద్యార్థులకు కలెక్టర్ క్రాంతి వల్లూరు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,విద్యార్థులను ,వారి తల్లిదండ్రులను ,ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ( జి. వర్షిత,590, జడ్‌పి హెచ్ ఎస్ కంకోల్) వి. గాయిత్రి 588 (జడ్పీహెచ్‌ఎస్ చెర్యాల్ ), (ఎం రషిత 586 టీఎంఆర్‌ఎస్ అందోల్



),హెచ్ దీపిక ( 586 జడ్పీహెచ్‌ఎస్ చేర్యాల్ ) విద్యారులకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉంటుందన్నారు. విద్యతో పాటు జిల్లాను అన్ని రంగాలలో ముందంజలో ఉంచాలన్నారు. జిల్లాలో విద్యకు సంబందించి జిల్లా కలెక్టర్‌గా తన వంతు పూర్తి సహకారాలు అందిస్తానని తెలిపారు.విద్యార్థులుఐఐటిలలోఉన్నతవిద్యలో జిల్లాకు మంచి పేరు తేవాలనీ ,మం చి ర్యాంక్‌లు తెచ్చుకోవాలని జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. వచ్చే విద్యా స ంవత్సరంలో జిల్లా మొదటి స్థానంలో ఉండాలన్నారు. జీవతంలో 10 వ తరగతి చా లా ముఖ్యమైనదని అందుకే విద్యార్థులు విద్యాసంవత్సరం మొదట నుంచే సన్నద్ధం అవుతారని అటు తల్లిదండ్రులు, ఉపాద్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యార్థులకి మంచి విద్యను అందించే ప్రయత్నం చేయడం జరుగుతుందన్నారు. ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సంగారెడ్డి జిల్లా విద్యాశాఖకు గర్వకారణమన్నారు. నవంబర్ నుండి ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ నాణ్యమైన గుణాత్మక విద్య భో దించి రోజులో ఒక పూట ప్రత్యేక తరగతుల ద్వారా విద్యాభోదన చేపట్టినట్లు వివరిచారు. పదవ తరగతి సిలబస్ డిసెంబర్లో పూర్తి చేసుకోవడం జరిగిందని, జనవరి ఒకటో తేది నుండి రెండు పూటల ప్రత్యేక తరగతులు నిర్వహించడం, జిల్లా విద్యాశా ఖ ఆద్వర్యంలో ప్రధానోపాద్యాయులతో ప్రత్యేక సమావేశాలు ,సలహాలు, సూచన లు ,పదవ తరగతి ఫలితాలు మెరుగుకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. సబ్జెక్టులలో వెనుకబడిన పిల్లలను గుర్తించి ప్రత్యేక తరగతుల ద్వారా ఇంగ్లీష్, గణితం, సబ్జెక్టులు భోదించడం జరిగిందని తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులను ఇంటర్లో జాయిన్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. జిల్లాల ప్రభుత్వ పాఠశాలలు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.

## బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

**జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రాజు**

**ప్రజాపక్షం/నిజాంపేట్ ;**మెదక్ జిల్లాబాల్యవివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జస్టేట్స్ ఫర్ చిల్డ్రన్స్ విజన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఎన్‌జిఒ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజు అన్నారు. ఎన్జీఓ డైరెక్టర్ వంగరీ కైలాస్ ఆదేశానుసారం బాల్య వివాహాలపై జిల్లాలోని దేవాలయాలు, మజీదులు, చర్చిలు, కాలనీలు, అంగన్వాడీ కేంద్రా ల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా రాజు మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయడమంటే చిన్న పిల్లలపై అత్యా చారాలు ప్రోత్సహించడం లాంటిదన్నారు. పూజారులు, ఫాస్టర్లు, ముస్లిం మతపెద్దలు పెళ్లిళ్లు చేసే సమయంలో అమ్మాయి, అబ్బాయి మేజర్లు అయితేనే వివాహాలు జరిపించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే రూ.లక్ష జరిమానతో పాటు రెండు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆలయాలు, చర్చిలు మజీద్ లలో చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ ప్రతిజ్ఞ చేయించామన్నారు.

## సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

**ఎంఇఒప్రతాప్ రెడ్డి**

**ప్రజాపక్షం/పాపన్నపేట:**ఈనెల 2వ తేదీ నుండి 16వ తేదీ వరకు నిర్వహించే సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, ఆరో తరగతి నుండి 9వ తరగతి వరకు చదివే బాల బాలికలలు ఈ క్యాంపుకు అర్హులన్నారు. ఈ క్యాంపులో డ్రాయింగ్, క్రాఫ్ట్, కరాటే, కుట్లు, అల్లకం, డ్యాన్స్, వివిధ రకాల ఆటపాటలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనునట్లు ఆయన వెల్లడించారు. 15 రోజులపాటు కొనసాగే ఈ క్యాంప్ పాపన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపుకు హాజరయ్యే వి ద్యార్థులకు స్నాక్స్ తో పాటు మంచినీటి సౌకర్యం కల్పించనునట్లు ఆ యన వివరించారు. మిగతా వివరాలకు 8500200859 నెంబర్ ను స ంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.నేర్పడానికి అర్హత గల ఇన్స్ట్రక్టర్లు తమను సంప్రదించాలని వీరికి ఒకరికి రూపాయలు 3000 చొప్పున చెల్లించడం జరుగుతుందని ఆయన వివరించా రు.

## కులగణన చేయడం దేశంలోనే ఒక గొప్ప రికార్డు

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనతో పాటు కులగణన ప్రక్రియలో భాగంగా కులగణన ప్రక్రియ వేగవంతం చేయాలని మాజీ ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ కేంద్రంపై కులగణనపై పోరాటం చేసినందుకు కేంద్ర ప్రభుత్వం కులగణన చేయుటకు నిర్ణయించడం పట్ల కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కార్యకర్తలు స్వీట్స్ పంపిణి చేసిన అనంతరం మాజీ ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీకి, రాష్ట్రంలో కులగణన చేసిన సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, నాయకులు ప్రకాశ్, బస్సీ నాయక్, శ్రీనివాస్,కృష్ణ, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ లక్ష్మయ్యకు ఘన నివాళి

**ప్రజాపక్షం/నెక్కొండ;**పీడిత తాడిత శ్రామిక వర్గాల కోసం కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు మరవలేనివని, ఎందరో నాయకులు భౌతికంగా దూరమైన వారిని స్మరిస్తూ వారి కుటుంబాలకు ఇప్పటికీ సమాజంలో అరుదైన గౌరవం లభిస్తున్నదని సిఐటియు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య ఏఐటిఈసి జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, ఎంసీపీఐ మండల కార్యదర్శి గాజుల వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల నాయకులు మారం రాము, ఈదునూరి వెంకన్న, తెలంగాణ గిరిజన రత్న వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ అన్నారు. నెక్కొండ మండల కేంద్రంలో స్థానిక జిపిఎస్ పాఠశాల ఎదురుగా కమ్యూనిస్టు దివంగత నేత కామ్రేడ్ బూరుగుపల్లి లక్ష్మయ్య, స్మారకస్తూపం ఎదుట అరుణ పతాకాన్ని ఎగురవేసి దివంగత కమ్యూనిస్టు నేత లక్ష్మయ్యకు ఘన నివాళులు అర్పించారు. విభిన్న సిద్ధాంతాలు ఉన్నప్పటికీ పీడిత వర్గాల పక్షాన తుది శ్వాస విడిచే వరకు పోరాడిన లక్ష్మయ్య సేవలను స్మరించేందుకు ఒక వేదిక పైకి రావడం తమకు ఆనందంగా ఉందన్నారు.



మూడు దశాబ్దాలు గడిచినప్పటికీ శ్రామిక వర్గాల గుండెల్లో బూరుగుపల్లి లక్ష్మయ్య చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, సిఐటియు మండల అధ్యక్షులు భూక్య నరేశ్ ఉపాధ్యక్షులు , ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు, సిపిఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, గుమస్తా సంఘం నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు , సొసైటీ మాజీ చైర్మన్, బిఆర్‌ఎస్ నాయకులు, ఎంసిపిఐ మండల నాయకులు సీనియర్ కమ్యూనిస్టు యోధుడు , ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాస్ నాయక్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## యువత ఆర్థికంగా ఎదగాలి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** యువత స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్క చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు రాజేందర్‌నాయక్ ఏర్పాటు చేసిన టీ, టిఫిన్స్ సెంటర్‌ను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రారంభించారు. కష్టమర్లకు మంచి నాణ్యమైన సేవలు అందించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, బీఆర్‌ఎస్ మండలాద్యక్షులు రమణాగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## బాధితులకు ఫోన్‌లు అందజేత

**ప్రజాపక్షం/వాజేడు;**ములుగు జిల్లా వాజేడు పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొద్ది రోజుల క్రితం మొబైల్ ఫోన్ లను పోగొట్టుకున్న నలుగురు బాధితులు వాజేడు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా వారి మొబైల్‌లను ట్రేస్ చేసి రికవరీ చేసుకొని తిరిగి బాధితులకు మొబైల్ లను ఎస్‌ఐ రాజ్ కుమార్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. మొబైల్ లను పోగొట్టుకున్న బాధితులు ఈశ్వరికి చెందిన వివో మొబైల్ విలువ 16 వేల రూపాయలు, రాజబాబు కు గల రియల్ మీ మొబైల్ విలువ 15 వేల రూపాయలు, శ్రీనివాస్ రియల్ మీ మొబైల్ విలువ 15 వేల రూపాయలు, కోటేష్ రెడ్ మీ మొబైల్ 14 వేల రూపాయలు విలువ గల మొబైల్స్ అన్నింటిని తిరిగి బాధితులకు అందజేశారు. ఎస్‌ఐ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎవరైనా బాధితులు తమ మొబైల్ ఫోన్ లను పోగొట్టుకున్నట్లయితే పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించవలసిందిగా కోరారు.

## మేడే స్ఫూర్తితో మోదీ విధానాలు వ్యతిరేకించండి

**సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్**

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:**వెట్టిచారికీ బానిసత్వంకు వ్యతిరేకంగా పనిగంటలు తగ్గింపు కోసం చికాగో నగరంలో చిందిన నెత్తుటి సాక్షిగా ఆవిర్భవించిన మేడే ఉత్సవాలను స్ఫూర్తిగా తీసుకుని దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ నరేంద్రమోడీ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేందవరకూ పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటంరాజు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకుని మేడే ఉత్సవలను మానుకోటలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయం నుంచి పట్టం పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సాదుల శ్రీనివాస్ మాట్లడుతూ కార్మికులు, కష్టజీవులు తమ శ్రమకు తగ్గ ఫలితం రావాలని పనిగంటలు తగ్గించాలని 139సంవత్సరాల క్రితం చికాగో నగరంలో చేసినపోరాట ఫలితంగా రక్తం చిందిచగా వేలాది మంది అమరులైన క్రమంలో ఎర్రజండా ఆవిర్భవించి మేడే ఉత్సవాలు ప్రారభమయ్యాయని అన్నారు.రక్తం మడుగులో ఉన్న అణగారిన కార్మిక వర్గాలు తమ నాయకుల నెత్తుటి మరకలతో తడిసిన బట్టను ఎర్రజెండాగా మలుచుకుని పోరాటాలకు సిద్దమయ్యారని తెలిపారు. కార్మిక కర్ష కుల జోలికి వస్తే శంకరగిరి మాన్యాలు పట్టిస్తమాని కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి హెచ్చరించారు. మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రతి సమ్మెలో కార్మికుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో అరుణపతాకాన్ని ఎగురవేశారు. పట్టణంలో సుమారు 30సెంర్లలో సిపిఎం ఆధ్వర్యంలోనూ 20సెంటర్లలో సిఐటియు ఆధ్వర్యంలో ఎర్రజండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమం సిపిఎ జిల్లా కార్యవర్గ సభ్యులురమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## నల్ల చట్టాలను రద్దు చేయాలి

**వామపక్ష నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు**

**ప్రజాపక్షం, తొర్రూరు :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వర్గ ప్రయోజనాలను నష్టపెట్టే నల్ల చట్టాలను రద్దు చేయాలని వామపక్ష పార్టీల నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, బొల్లం అశోక్‌లు డిమాండ్ చేశారు. గురువారం 139వ మేడే సందర్భంగా తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలను నిర్వహించారు. వివిధ కూడళ్లలో ఎర్ర జెండాలను ఆవిష్కరించి కార్మికులు పెద్ద ఎత్తున గాంధీ సెంటర్ నుండి బస్టాండ్ మీదుగా విశ్రాంతి భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, బొల్లం అశోక్, ఎండి.యాకూబ్, ఓమ బిక్షపతి, బంధు మహేందర్, జమ్ముల శ్రీను, గణపురం లక్ష్మ ణ్, సోమిరెడ్డిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వామపక్ష భావజాలాన్ని తుడిచిపెట్టడం కోసం ప్రయత్నాలు చేస్తూనే మూడు లేబర్ కోర్టు చట్టాలను తీసుకువచ్చి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నేలరాసే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఇటువంటి చట్టాలను రద్దు చేయడం కోసం దేశవ్యాప్త సమ్మెను ఈ నెల 20న కార్మిక సంఘాలు భారత్ బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికవర్గ ప్రయోజనాలను నష్టపర్చే నల్ల చట్టాలను రద్దు చేయాలని లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పేయింటర్ యూనియన్ నాయకులు , సివిల్ స్లపయి హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగురుపీఠంకు రూ. 10వేల విరాళం

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని గూడురు గ్రామంలో నిర్మిస్తున్న శ్రీగురుపీఠంకు అదేగ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్‌గౌడ్ కూతురు విశ్వజ తన మొదటి నెల స ంపాదనలోని రూ. 10వేల నగదును ట్రస్టు చైర్మన్ శివకుమార్‌గౌడ్ కు విరాళంగా అందజేశారు. చిన్న వయస్సులోనే సేవా దృక్పథం కలి గి ఉండడంపై ప్రశంసించి విశ్వజకు హార్థిక అభినందనలు తెలిపారు

